క్లుప్తంగా

వర్షం కోసం బుగ్గరామేశ్వరుడికి పూజలు



బుగ్గరామేశ్వరునికి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : వరుణదేవుడు కరుణ కోసం కాల్వ బుగ్గ దేవస్థానంలో బుగ్గరామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నూలు మార్కెట్ యార్డుకు చెందిన మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, కట్టం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కోనేటి నుంచి 1001 బిందెలతో నీటిని తీసుకొచ్చి స్వాముల వారికి జలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు సంతోషంగా వుండాలని బుగ్గరామేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె.లక్ష్మినారాయణ శర్మ స్వామి, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు.

గొల్లలదొడ్డిలో సామాజిక తనిఖీ గ్రామసభ



నివేదికలు చదువుతున్న డీఆర్పీ లక్ష్మన్న

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ అంశాలపై డీఆర్పీ లక్ష్మన్న గ్రామ సభ నిర్వహించారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన గ్రామ సభలో గ్రామ పంచాయతీ పరిధిలో 41 పనులను చేపట్టగా, రూ.33 లక్షల పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల్లో 13 కాలువలు, 3 చెక్ డ్యాంలలో పూడికతీత పనులు, 9 పండ్ల తోటల పెంపకం పనులు, ఒక ఇంకుడు గుంత పని, అలాగే 12 హౌసింగ్, 3 రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు డీఆర్పీ సభలో వెల్లడించారు. కాగా పనుల కొలతలలో తేడాలున్నట్లు తనిఖీలో తేలిందని ఎస్ఆర్పీ వెంకటేష్ నాయక్ తెలిపారు.ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి జగదీష్, టీఏ ఉమా, టీఏ రైతులు, కూలీలు పాల్గొన్నారు.

బీసీ కాలనీకి శాశ్వత పరిష్కారం చూపుతాం



బీసీ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా అధికారులు

పాణ్యం : మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపతామని డీపీఓ లలితాబాయి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం గ్రామంలో అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. త్వరలోనే వీటికి సంబంధించి ప్రణాళిక రూపొందించి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ జనార్దన్, వివిధ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



ముడుమలగుర్తిలో సంచార చికిత్సను పరిశీలిస్తున్న డా.రఘు

కోడుమూరు రూరల్: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డా.రఘు సూచించారు. సోమవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు మదన్‌శేఖర్, లలితజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

గడివేముల: అత్తారింటి వేధింపులు తాళలేక ఎల్ కే తండా గ్రామానికి చెందిన నిర్మల బాయి (21) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నిర్మల బాయి వద్ద ఉన్న బంగారం నగలను భర్త శ్రీకాంత్ నాయక్ తీసుకున్నాడు. వాటిని బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్నాడు. బంగారు విడిపించాలని కొన్ని రోజుల నుంచి కోరుతున్నా విడిపించకపోవడంతో పాటు అత్త మామల వేధింపులు తట్టుకోలేక నిర్మల బాయి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బుజ్జిబాయి ఫిర్యాదు మేరకు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వంతెనలు.. ప్రమాదాలకు నిలయాలు



జింగవరం సమీపంలో చింతలమడ వాగుపై వంతెనకు సైడ్‌వాల్స్ లేని దృశ్యం



ఆర్.కొంతలపాడు వద్ద కడ్డీలవాగుపై ప్రమాదకరంగా వంతెన

కర్నూలు(రూరల్): మండలంలో పలు వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామాల మధ్యలో రాకపోకలకు వీలుగా గతంలో నిర్మించిన వంతెనలు శిథిలమవడంతో ప్రమాదలకు నిలయాలుగా మారాయి. వంతెనలు శిథిలావస్థకు చేరడం, సైడ్ వాల్స్ పడిపోవడంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణం భయాందోళన కలిగిస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

➤ కర్నూలు – సుంకేసుల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో జి.సింగవరం సమీపంలో చింతలమడ వంతెన దగ్గర మూలపలుపు ఉండటం, లైట్లు ఏర్పాటు చేయకపోవడం, సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తూంటాయి. ప్రయాణ సమయంలో ఆదమరిస్తే వాగులో పడే ప్రమాదం ఉంది .గతంతో ఇక్కడ ఎంతో మంది ప్రమదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయారు.

➤ ఇదే రహదరిపై ఆర్. కొంతలపాడు గ్రామం వద్ద కడ్డీల మోరి అనే వంతెన ప్రమాదకరంగా ఉంది. ఇరువైపులా సైడ్ వాల్స్ దెబ్బతినడంతో బ్రిడ్జి పిల్లర్లు కొంతమేర పగుళ్లు ఇచ్చాయి. కర్నూలు నుంచి సుంకేసుల వెళ్లే వాహనదారులు, ఆర్. కె. దుద్యాల ,తులశాపురం ,బసాపురం ,ఎదరూరు గ్రామాలకు చేందిన రైతులు దిగుబడులను ఇంటికి తరలిస్తూంటారు.అదమరిస్తే మోరీలో పడే అవకాశం ఉంది.

➤ గార్గేయపురం నుంచి కేతవరం గ్రామానికి వెళ్లే దారిలో పారువేట అరుగు వద్ద తక్కువ ఎత్తులో వంతెన ఉండటం, వాగు లోని వర్షపు నీరు నుంచి వంతెనపై ప్రవహిస్తుంది. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం పడిన సందర్భాల్లో ఇక్కడ ప్రమాదలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే..ఆయా వంతెనల ముందు రహదారులు గుంతల మయంగా మారడంతో ప్రయాణం ప్రమాదలకు కారణంగా మారుతోందని వహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు



కల్లూరు అర్బన్‌లో కూటమి ప్రభుత్వ మోసాలను నమోదు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరులో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 32వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో వివిధ సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంతో మోసపోయింది ముజఫర్‌నగర్‌లో ప్రజలకు వివరించారు. కాలనీలో ఎవరిని పలకరించినా సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రతిదాంట్లో కోతలు పెట్టి కొందరికే ఇస్తున్నారని ప్రజలు కాటసానికి తమ గోడువెళ్లబోసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు గమనించాలన్నారు. కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, నరసింహులు, నారాయణరెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, రంగప్ప, భవాని, మోహన్, శ్రీను. గోపి, షేక్షావలి, హుస్సేన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సి.బెళగల్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్‌కు) మండల రైతుల నుంచి వచ్చిన భూ సమస్యల అర్జీలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, వీఆర్వోలతో కలిసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మందొడ్డి, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ భూములకు జాయింట్ ఎల్‌పీఎంలుగా ఉన్నాయని, వాటిని తొలగించి తమ భూములను రికార్డుల కొలతల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. పోలకల్, కంబదహాల్, సంగాల గ్రామాల రైతులు అన్నదమ్ముల విభాగాల సమస్యలను, మండల కేంద్రానికి చెందిన ప్రజలు తమ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని అర్జీ రూపంలో తహసీల్దార్‌ను కోరారు. మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఉన్నారు. అలాగే..స్థానిక మండల పరిషత్ ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్, ఎంఈఓ ఆదామ్‌బాషా పాల్గొన్నారు.

ధూమపానంతో క్షయ ముప్పు



పోస్టర్లను అవిష్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): పొగతాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ భాస్కర్ తెలిపారు. సోమవారం కర్నూలు మండలం ఇ. తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ వ్యాధిగ్రస్తులకు సరుకులు ఉచితంగా అందచేశారు. జిల్లా న్యూక్లియస్, మెడికల్ ఆఫీసర్, మల్లికార్జున, అధికారులు మక్బుల్ సాహెబ్, నిర్మలాదేవి,ధనమ్మ, నిషిత్ ల్యాబ్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా!



తహసీల్దార్, వీఆర్వోలు, స్త్రీ సంక్షేమ శాఖ, సెరికల్చర్,అగ్రికల్చర్ శాఖల అధికారులు హాజరైన దృశ్యం



కర్నూలు మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఒక్కరే ఉన్న దృశ్యం

కర్నూలు(రూరల్):ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయిలో పలువురు అధికారులు హాజరు కావడం లేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి మండల స్థాయిలోని అధికారులు తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. మిగిలిన శాఖల అధికారులు సక్రమంగా రావడం లేదు. సోమవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యలయంలో నిర్వహించిన (పీజీఆర్ఎస్)కు వీఆర్ఓలు, ముగ్గురు అధికారులు మాత్రమే హాజరయ్యారని కర్నూలు రూరల్ తహసీల్దార్ టీ.వీ.రమేష్ బాబు తెలిపారు.


ఎంపీడీఓ ఒక్కరే..

కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రఘునాథ్‌ఒక్కరే పాల్గొన్నారు. అయితే.. పంచాయతీ రాజ్ శాఖ మండల ఇంజినీరు, ఉపాధి హామీ ఏపీఓ అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయారు.ఇక విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, ఎక్సైజ్ ,వెలుగు మెప్మా,హౌసింగ్,ఆర్అండ్‌బీ, ఫిషరీస్ తదియితర శాఖలకు చెందిన వారెవరూ రాలేదు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ్ సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

పోకిరీలపై ప్రత్యేక నిఘా



పట్టుబడిన పోకిరీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజరావు

కర్నూలు: విద్యాసంస్థల వద్ద తిష్ట వేసి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కొంతమంది ఆకతాయిల వల్ల విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళల నుంచి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మఫ్టీ బృందాలను నియమించి నిఘా ఏర్పాటు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమా ఆర్కేడ్‌లో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీ, కేవీఆర్ కాలేజీ, మౌర్యా ఇన్ సర్కిల్ వద్ద ఉన్న చైతన్య కాలేజీ వద్ద పోలీసు సిబ్బంది సోమవారం మారు వేషంలో ఉండి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న 20 మంది పోకిరీలను అదుపులోకి తీసుకుని, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాలేజీల వద్ద మాటు వేసి అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే భవిష్యత్తులో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి పంపారు. సీఐ జీవీ నాగరాజరావు, ఎస్ఐలు సతీష్‌కుమార్, మల్లికార్జునతో పాటు సిబ్బంది ఆయా కళాశాలల వద్ద మారువేషంలో ఉండి పోకిరీల భరతం పట్టారు. ఇకపై కాలేజీల వద్ద నిరంతర నిఘా ఉంటుందని, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ నాగరాజరావు హెచ్చరించారు.

■ తాగునీరు వృథా

పాణ్యం: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్ నుంచి నిత్యం నీరు వృథా అవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు 500పైగా ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు భారీ సంఖ్యలో ఇళ్లు కట్టుకున్నారు. వారికి తాగునీటి కోసం బోర్లు వేసి మినీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. మెయిన్ బజార్‌లో ఉన్న మినీ ట్యాంక్ మోటార్ నిత్యం నీరు ఓవర్ ఫ్లో అయ్యి వృథా అవుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోని నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు



మినీట్యాంక్ నుంచి వృథాగా పారుతున్న నీరు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

- పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక క్యాంపులు
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్ నుంచి శానిటేషన్, సీజనల్ వ్యాధులు, టేక్ హోం రేషన్ అంశాలపై నియోజకవర్గ, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్‌డీలు, సీడీపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం మొదలైనందున ప్రత్యేక శానిటేషన్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైనేజీలను శుభ్రం చేయడం, తాగునీటి పైపుల లీకేజీలను అరికట్టడం, ట్యాంకులను శుభ్రం చేసే పనులను నిరంతరం చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. చిప్పగిరి మండలం ఏరూరు, కోడుమూరు మండలం కోడుమూరు-3, ప్యాలకుర్తి, హొళగుంద మండలం హెబ్బటం, కోసిగి మండలం చీర్తనకల్, ఓర్వకల్ మండలం లొద్దిపల్లె, పెద్దకడుబూరు మండలం నౌలేకల్ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంపై ఫిర్యాదులు రావడంతో ఆయా మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలను హెచ్చరించారు. ఆయా గ్రామాలను అధికారులు సందర్శించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సక్రమంగా పనిచేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మునిసిపాలిటీల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో అక్కడక్కడా చికెన్‌గున్యా వ్యాధి ప్రబలుతోందన్నారు. వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల క్లీనింగ్, ఫాగింగ్, డ్రై డే తదితర చర్యలు చేపట్టాలన్నారు. సీబెళగల్, కృష్ణగిరి, కర్నూలు మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ఆయా మండలాల అధికారులతో ఆరా తీశారు. ఆదోని, దేవనకొండ, హాలహర్వి, కృష్ణగిరి మండలాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి రాలేదని, త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఆలూరు మండలంలో 34 ట్యాంకుల్లో 9 మాత్రమే క్లీనింగ్ చేశారని, మిగతా వాటిని ఎందుకు చేయలేదని ఎంపీడీఓను ప్రశ్నించారు. పంచాయతీ సెక్రటరీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డీపీఓను ప్రశ్నించారు. జిల్లా బాల సంజీవని, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీ సరిగాచేపట్టాలని సీడీపీఓలను ఆదేశించారు. ఆయా వివరాలను పోషణ్ యాప్‌లో నమోదు చేయడంలో ఆదోని, ఎమ్మిగనూరు సీడీపీఓలు వెనుకబడి ఉన్నారని, అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇప్పించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నిర్మళను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరాజు, డీపీఓ భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు పాల్గొన్నారు.

- 17న జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): అధికార యంత్రాంగం ఏర్పాటు చేసే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. ఈనెల 17న ఆదోనిలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాపై ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదోని సాయి డిగ్రీ కాలేజీలో నిర్వహించే జాబ్‌మేళాలో 11 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, 450 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న యువత అర్హులని, అర్హులైన వారు nai punya-m.a p.g-ov.i n వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే 99854 96587, 97039 93995 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు పింఛన్లు ఇవ్వాలి

కోడుమూరు రూరల్: 50ఏళ్ల పూర్తయిన డప్పు కళాకారులకు కూటమి ప్రభుత్వం వెంటనే పింఛన్లు ఇవ్వాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. సోమ వారం గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదైనా ఇంత వరకు డప్పు కళాకారులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ చేయలేదన్నారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, డీకేఎస్ మండల అధ్యక్షుడు భగవంతు, కార్యదర్శి నాగరాజు, నాయకులు ఏసేపు, తిమ్మప్ప, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పీ4పై ప్రజల అభిప్రాయాలను తెలుకోవడంతో పాటు బంగారు కుటుంబాలను దత్తతకు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరగుతుందన్నారు. 15న గడివేముల, 16న బూజునూరు, బిలకలగూడూరు, 17న చిందుకూరు, గడిగరేవుల, 18న దుర్వేశి, కొరటమద్ది, 22న కరిమద్దెల, పెసరవాయి, 23న కొర్రపోలూరు, మంచాలకట్ట, 24న దుర్వేశి, ఒండుట్ల గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని గడిగిరేవుల గ్రామానికి చెందిన ఓ వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని గడిగరేవుల గ్రామానికి చెందిన గోదా కష్ణవేణికి ఏడాది కిందట నంద్యాలకు చెందిన వెంకట శివ భరత్‌తో వివాహమయ్యింది. కొద్ది రోజులు పాటు సంసారం సాఫీగా కొనసాగింది. ఆ తరువాత భర్తతోపాటు అత్త సుబ్బలక్ష్మి, మామ గోపాల్, బావ రమణ కుమారులు వేధింపులకు గురి చేస్తుండటంతో మానసిక వేదన తట్టుకోలేక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్టాంటన్‌పురం, మమత నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

3న బహుజన ప్రజాప్రతినిధుల సభ

పాణ్యం: ఆగస్టు 3న అనంతపురం జిల్లాలో నిర్వహించే బహుజన ప్రజాప్రతినిధుల సభను జయప్రదం చేయాలని ఆర్‌పీఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. దేశంలో 56శాతంగా ఉన్న బీసీలకు పార్లమెంట్‌లో, శాసనసభ, మండలిలో 44శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. విద్యా, ఉద్యోగ, ప్రైవేట్ రంగాల్లో 44శాతం అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూల నుంచి ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాద్రి, నాగరాజు, శ్రీనివాసులు, బాలరాజు, సుధార్, ఈశ్వరయ్య, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు



డీఈఈ జేసన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: ప్రజలకు భారంగా మారిన స్మార్ట్ మీటర్ల బిగింపును కూటమి ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం కోడుమూరులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి డీఈఈ జేసన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో పొలాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండి అంటూ యువగళం పాదయాత్రలో పిలుపునిచ్చిన మంత్రి నారాలోకేష్ నేడు అదే మీటర్లను బిగిస్తుండటం దుర్మార్గమన్నారు. తాము అధికారంలోకొస్తే కరెంట్ చార్జీలను పెంచమని చెప్పిను చంద్రబాబు నాయుడు నేడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారం మోపారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి రాజు, నాయకులు వీరన్న, లక్ష్మన్న, గంగాధర్, బాబు, నాగరాజు, మాసుంవలి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని మానుకోవాలి

ఓర్వకల్లు : ఇళ్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లను అమర్చాలనే యోచనను ప్రభుత్వం మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ అన్నారు. సోమవారం స్మార్ట్ మీటర్ల విధానానికి వ్యతిరేకంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ మండల నాయకులు మధుసూదన్, రామకృష్ణతో మండల కార్యదర్శి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి డ్రైనేజీలు నిండడంతో కాలనీలోని రహదారిపైకి మురుగునీరు చేరి, ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉందని చెబుతున్నారు. దగ్గరలోనే పురాతన బావి ఉండటంతో అందులోకి గ్రామంలోని మురుగునీరు చేరుతోందని, బావి నిండి ఆ నీరు కాలనీలోని రోడ్ల పైకి వస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు డ్రైడే పేరుతో ఫొటోలు మాత్రమే తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకుంటున్నారే తప్ప గ్రామాల్లో మాత్రం పారిశుద్ధ్య పనులు ఏమీ చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించికోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అదికారులు స్పందించి రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చేలాని, డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బీసీ కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు